సాక్షి వికారాబాద్

శుక్రవారం, 26, మే, 2023



యువత చూపు..
నేటి సమాజంలో కంప్యూటర్ పాత్ర చాలా ముఖ్యమైంది. దీంతో యువత, విద్యార్థులు కంప్యూటర్ విద్యపై దృష్టి సారిస్తున్నారు. 8లో▸



'మన బడి'కి వెళ్లేదెప్పుడో?
గ్రామీణ పాఠశాలల అభివృద్ధి కోసం మన ఊరు- మనబడి పేరుతో వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టిసారించింది. 8లో▸



తండాపై చిన్నచూపు
నవాబుపేట మండలంలోని ఏకైక తండా కేశవపల్లి. ఈ గ్రామం వివిధ కారణాలతో పంచాయతీగా గుర్తింపు పొందలేదు. 9లో▸

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



అఖిల శివసాయి

కుల్కచర్ల: మండల పరిధిలోని ముజాహిద్‌పూర్‌కు చెందిన మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థి అఖిలశివసాయి జాతీయ స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 24న వరంగల్‌లోని ఏకశిల మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో సత్తాచాటింది. వచ్చే నెల పశ్చిమబెంగాల్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి, పీఈటీ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లు

మర్పల్లి: తెలంగాణ మోడల్ స్కూల్ మర్పల్లిలో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణకుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్‌లో ప్రవేశం కోసం పరీక్ష రాసిన వారు హాల్ టికెట్లతో వచ్చి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాల కోసం ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు స్కూల్‌లో సంప్రదించాలని తెలిపారు.

సీఎండీ పర్యటనపై కార్మికుల అసంతృప్తి



కార్మికులకు న్యూట్రీషన్ కిట్లు అందజేస్తున్న సీసీఐ సీఎండీ సంజయ్‌బంగా

తాండూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సీసీఐ ఫ్యాక్టరీ సందర్శనకు వచ్చిన సీఎండీ సంజయ్‌బంగా తీరుపై కార్మికులు అసంతృప్తి వ్యక్తంచేశారు. బుధవారం సాయంత్రం ఫ్యాక్టరీకి చేరుకున్న ఆయన గురువారం ఉదయం వెళ్లిపోయారు. దీంతో సీఎండీ ఇలా వచ్చి.. అలా వెళ్లారని చెబుతున్నారు. వివిధ విభాగాల అధిపతులతో సమావేశమైన ఆయన కంపెనీలో కార్మికుల సంఖ్యను తగ్గించాలని సూచించడంపై అసహనం వ్యక్తంచేశారు. రిటైర్మెంట్ అయిన వారి స్థానంలో కొత్త ఉద్యోగులను నియమించడం లేదని.. కంపెనీని ప్రవేటీకరణ చేసేందుకే ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యలు తెలుసుకోలేదని. ఫ్యాక్టరీలోని రైల్వే పట్టాల విక్రయం, సిమెంట్ బస్తాల తరలింపు వ్యవహారాలను ప్రస్తావించలేదన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరించారని తెలిపారు. అంతకుముందు ఫ్యాక్టరీలో టీబీ వ్యాధితో బాధపడుతున్న 12 మంది కార్మికులకు సీఎండీ న్యూట్రీషన్ కిట్లు అందజేశారు. ఆరు నెలల పాటు సీసీఐ తరపున వీరికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని చెప్పారు. ఆయన వెంట జీఎం మహాన తదితరులు ఉన్నారు.

సమీకృత మార్కెట్ త్వరగా పూర్తి చేయాలి

మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సూచించారు. తుక్కుగూడ మున్సిపల్ కేంద్రంలోని వార సంత ప్రదేశంలో చేపడుతున్న సమీకృత మార్కెట్ పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వెజ్, నాన్‌వెజ్ వ్యాపార సముదాయాలు ప్రజలకు అందుబాటులో ఒకే ప్రదేశంలో ఉండేలా ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల్లో సమీకృత మార్కెట్లను మంజూరు చేసిందని అన్నారు. రూ.4 కోట్లకుపైగా ఖర్చు చేసి ఈ మార్కెట్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీంతో చిరు వ్యాపారులకు ఉపాధితో పాటు ప్రజలకు నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంటాయన్నారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా పనులు పూర్తి చేసి త్వరగా అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, కౌన్సిలర్ రవినాయక్, నాయకులు సప్పిడి రాజు, బూడిద శ్రీకాంత్, ముప్పిడి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడలో మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి సబితారెడ్డి

టార్గెట్.. మనోళ్లే!

బీఆర్ఎస్‌లో వింత ధోరణి
- సొంత పార్టీ నేతలే లక్ష్యంగా సిట్టింగుల అడుగులు
- ఆత్మీయ సమ్మేళనాల పేరుతో హంగామా
- 'అసమ్మతి' నేతలను ఆహ్వానించని వైనం
- ప్రతిపక్షాలను ప్రస్తావించకుండా.. ఆశావహులపై వ్యంగ్యాస్త్రాలు



వికారాబాద్: సిట్టింగులకే సీట్లు అంటూ జిల్లాలో మంత్రులు, ఎంపీ చేస్తున్న వ్యాఖ్యలు, ప్రకటనలపై అధికార పార్టీలో తీవ్ర దుమారం రేగుతోంది. ఈ తతంగం కోసం ఆత్మీయ సమ్మేళనాల పేరుతో మంత్రులు, ఎంపీలు, పార్టీ ఇన్‌చార్జ్‌లను రప్పించుకుంటున్న స్థానిక ఎమ్మెల్యేలు.. వీరి ద్వారా టికెట్ కన్ఫామ్ అనే అర్థం వచ్చేలా వారితో మాట్లాడిస్తున్నారు. ఇటీవల వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన బీఆర్ఎస్ సమ్మేళనాల్లో ఇవే ప్రకటనలు వెలువడ్డాయి.

పార్టీ ప్రస్తావనే లేదు..!

పార్టీ సమ్మేళనాలకు మంత్రులు, ఎంపీలు వచ్చిన సందర్భంలో స్థానిక ఎమ్మెల్యేలు బల ప్రదర్శన కోసం.. పార్టీ శ్రేణులతో పాటు డబ్బులు ఇచ్చి జనాలను తరలించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఆయా మీటింగ్‌లలో మంత్రులు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను గెలిపించాలని చెప్పిన సందర్భాలు చాలా తక్కువే. పార్టీ పేరు ప్రస్తావించకుండా.. నేరుగా మీ ఎమ్మెల్యేను మరోసారి దీవించండి.. ఈయనకే టికెట్ ఇస్తాం అనేలా ప్రసంగించారు. దీనికి తోడు ప్రతిపక్షాల ఊసు పెద్దగా లేకుండానే ముగించారు. దీంతో ఈ సమావేశాలన్నీ స్వపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని నిర్వహిస్తున్నవే అనేలా ముద్రపడ్డాయి.

పోటాపోటీగా జనసమీకరణ

క్లస్టర్, మండల స్థాయి ఆత్మీయ సమ్మేళనాలు, సమావేశాలు అంటూనే నియోజకవర్గ కేడర్‌ను మొత్తం మీటింగ్‌లకు రప్పించి హంగామా సృష్టిస్తున్నారు. అధికార పార్టీలో ఉన్న అసమ్మతి వర్గాలను టార్గెట్ చేస్తూ పెద్ద ఎత్తున సమావేశాలతో హడావుడి చేస్తున్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ పోటీపడేలా జనాలను సమీకరిస్తున్నారు. సీఎం మీటింగ్ తరహాలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసి రాజకీయ వైభవం చాటుతున్నారు. ఇది ఓ రకంగా చూస్తే ఇప్పుడే ఎన్నికల వాతావరణం వచ్చిందా..? ప్రస్తుత ఎమ్మెల్యేలందరికీ టికెట్లు కన్ఫామ్ అయ్యాయా..? అనే తరహాలో హంగామా చేస్తున్నారు. దీంతో ఆత్మీయ సమ్మేళనాలు హంగామా మీటింగులుగా మారుతున్నాయి.

ఫిట్టింగ్ ఉంది జాగ్రత్త

జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ తమకు తిరుగులేదనే రేంజ్‌లో రెచ్చిపోతున్నారు.సిట్టింగులకే సీట్లు అంటూ తమ అధినేత, సీఎం కేసీఆర్ పలుమార్లు మీడియా ముఖంగా ప్రకటించారని కాలర్ ఎగరేస్తున్నారు.కానీ సిట్టింగులకు సీట్లు అంటూనే పనితీరు బాగా లేకపోతే ఫిట్టింగ్ తప్పదని గులాబీ బాస్ హెచ్చరించిన విషయాన్ని మాత్రం ప్రస్తావించడం లేదు.

అసంతృప్త నేతల గైర్హాజరు

ఇప్పటి వరకు జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలకు అసంతృప్త, అసమ్మతి నేతలెవరూ హాజరు కాలేదు. దీంతో ఈ సమావేశాలన్నీ సొంత పార్టీ నేతలను టార్గెట్ చేసుకుని ఏర్పాటు చేసినట్లే కనిపించాయి. అతిథులుగా హాజరైన ప్రముఖులు సైతం స్థానిక ఎమ్మెల్యేలకు టికెట్లు కన్ఫామ్ అనేలా స్పీచ్‌లు దంచారు. దీంతో ఆశావహులు, అసంతృప్త వర్గాల నుంచి విమర్శలు మొదలయ్యాయి. ఒకానొక దశలో ఈ వ్యవహారాలు కొంత ఇబ్బందికరంగా మారే పరిస్థితికి చేరింది. టికెట్లు ఇచ్చేది మంత్రులా..? ఎంపీలా..? లేక పార్టీ అధిష్టానమా అని ప్రశ్నించే స్థాయికి చేరింది. మరో పక్క కొంతమంది నేతలు ఈ విషయాలపై బహిరంగంగా కామెంట్లు చేస్తున్నారు. గెలుపు గుర్రాలకే టికెట్లు వస్తాయని, ప్రజాదరణ ఉన్నవారికే అధిష్టానం మద్దతు ఉంటుందని చెబుతున్నారు. ఎవరికి వారు ఇష్టారాజ్యంగా మాట్లాడటం సరికాదని హెచ్చరికలు చేస్తున్నారు. కొంతమంది నాయకులు మరో అడుగు ముందుకేసి అవినీతి, సెటిల్‌మెంట్లకు పాల్పడే వారి తోకలను అధిష్టానమే కట్ చేస్తుందని, అప్పటి వరకు కొంత ఓపికగా ఉండాలని తమ శ్రేణులకు సూచిస్తున్నారు. ఈ వ్యవహారంలో సోషల్ మీడియా, పార్టీ వాట్సాప్ గ్రూపులను వేదికగా చేసుకుని మంత్రులు, ఎమ్మెల్యేలపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ఉద్యమ సమయం నుంచి పార్టీలో ఉంటూ.. సేవ చేస్తున్న వారికి టికెట్లు ఆశించే హక్కు లేదా అని ప్రశ్నిస్తున్నారు.



సీఎం సమీక్షలో కలెక్టర్, ఎస్పీ

ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన సచివాలయంలో గురువారం నిర్వహించిన మంత్రులు, ఉన్నత స్థాయి అధికారుల సమీక్షలో మన కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్పీ ఎస్.కోటిరెడ్డి పాల్గొన్నారు. జిల్లాలో నిర్వహించే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లు, పోడు పట్టాలు, డబుల్ బెడ్రూంల పంపిణీ, హరితహారంపై చర్చించారు.

– వికారాబాద్ అర్బన్

ప్రతీ రైతుకు పంట రుణం



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు

- లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు
- తాండూరులో బ్యాంకర్లతో సమావేశం

తాండూరు రూరల్: పట్టా పాసు పుస్తకం ఉన్న ప్రతీ రైతుకు పంట రుణాలు ఇవ్వాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ మూడు నెలలకోసారి సమావేశం ఏర్పాటు చేసి రుణాల వితరణ, వ్యవసాయ, ఉద్యాన, పట్టు, స్వయం సహాయక సంఘాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రుణాల పంపిణీపై సమీక్షిస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం 86 మంది లబ్ధిదారుల జాబితాను పంపించిందని, వీరికి సకాలంలో రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. జిల్లాలో వ్యవసాయ రుణాలకు సంబంధించి 75 శాతం రైతులు పంట రుణాలను రెన్యువల్ చేసుకున్నారని స్పష్టంచేశారు.

3శాతం వడ్డీ రిటర్న్..

బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు ఏడాదిలోపు వడ్డీ చెల్లిస్తే 3శాతం వడ్డీ రిటర్న్ వస్తుందని ఎల్‌డీఎం రాంబాబు అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏడాదికి మించి ఒక్కరోజైనా 11 శాతం వడ్డీ పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుదర్శన్ రెడ్డి, హార్టికల్చర్ ఏడీ మల్లికార్జున్, సెరీకల్చర్ ఆఫీసర్ విజయ్‌కుమార్, ప్రజాప్రతినిధులు వినోద్ కుమార్, వెంకట్రావ్, రవికుమార్ పాల్గొన్నారు.

ఓయూ ఇంజినీరింగ్ కోర్సుల ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ వివిధ విభాగాల ఫైనలియర్ కోర్సుల ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఈ నెల 16న ప్రారంభమై 20న ముగిసిన పరీక్ష ఫలితాలను కేవలం ఐదు రోజుల్లో విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేశ్ తెలిపారు. సివిల్ 98.44 శాతం, మెకానికల్ 100, ఎలక్ట్రికల్ 100, ఎలక్ట్రానిక్స్ 98.11, కంప్యూటర్ సైన్స్ 100శాతం మంది పాసయ్యారు.

బాల్య వివాహాలు నేరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న లలితకుమారి

- వీటి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి
- జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి

వికారాబాద్ అర్బన్: ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం నేరమని తెలిపారు. అలా చేసిన వారు బాల్య వివాహాల నిషేధిత చట్టం 2006 ప్రకారం జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమ శాఖ ఆధ్వర్యంలో గతేడాది 155 బాల్య వివాహాలను అడ్డుకున్నామని వెల్లడించారు. రహస్యంగా జరిగిన పలు వివాహాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 71 బాల్య వివాహాలను నిలిపి వేసినట్లు వివరించారు. బాల్య వివాహాలు చేస్తే ప్రభుత్వం ద్వారా అందించే కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు వర్తించవని తెలిపారు. ఈ విషయంపై తల్లిదండ్రులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతీ గ్రామంలో మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను బలోపేతం చేసి వీటిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక వార్డు మెంబర్లు, ప్రజా ప్రతినిధులు ఇందుకు సహకరించాలని కృషి చేయాలని కోరారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1098కు లేదా 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వరమ్మ, సూపర్‌వైజర్ కళావతి, సూపరింటెండెంట్ చెన్నారెడ్డి పాల్గొన్నారు.

గడువులోపు ధాన్యం సేకరించాలి

- మిల్లుల వద్ద వెంటవెంటనే అన్‌లోడ్ చేయాలి
- రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ



వికారాబాద్ అర్బన్: రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని తప్పనిసరిగా దించుకునే విధంగా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. ఈ మేరకు గురువారం సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారని, ఈప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. మిల్లుల వద్దకు వచ్చిన ధాన్యం లోడ్‌లు వెంటవెంటనే అన్‌లోడ్ అయ్యేలా చూడాలని తహసీల్దార్లకు సూచించారు. మిల్లర్ల వద్ద అవసరం మేరకు హమాలీలను సమకూర్చుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అవసరమైతే ట్రాక్టర్లను సైతం వినియోగించుకోవాలని సూచించారు. రాబోయే పది రోజులు చాలా కీలకమని, ఏజెన్సీలన్నీ కేటాయించిన లక్ష్యం మేరకు రోజు వారీగా టార్గెట్ పూర్తి చేయాలని వివరించారు. వర్షాలతో ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు చెప్పారు. ప్యాడీ క్లీనర్లు, తూకం యంత్రాలను సమకూర్చుకోవాలని సూచించారు. సెంటర్ల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ విమల, డీఆర్‌డీఓ కృష్ణన్, మార్కెటింగ్ అధికారి సారంగపాని తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారనని ప్రమాణం చేయండి



తాండూరులో మాట్లాడుతున్న రాజుగౌడ్

- మహేందర్‌రెడ్డి వ్యాఖ్యలను ఆహ్వానిస్తున్నాం
- అధిష్టానం ఎవరికి అవకాశం ఇస్తే వారే పోటీ చేయాలి
- జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సందల్ రాజుగౌడ్

తాండూరు: బీఆర్ఎస్ టికెట్ రాకపోతే పార్టీ మారబోనని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి భద్రేశ్వరాలయంలో ప్రమాణం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సందల్ రాజుగౌడ్ సవాల్ విసిరారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి తాండూరు టికెట్ తనకే వస్తుందని.. గెలిచేది కూడా తానేనని ఎమ్మెల్సీ ప్రకటించారని గుర్తుచేశారు. ఒకవేళ సీఎం కేసీఆర్ ఆయనకు టికెట్ ఇవ్వకపోతే పార్టీ మారబోనని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలా చేస్తే పార్టీలో ఎవరు ఒరిజినల్ నాయకులో.. ఎవరు డూప్లికేటో..? తేలిపోతుందని స్పష్టంచేశారు. తాండూరు నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి రూ.50 లక్షలు, మున్సిపాలిటిలోని ఒక్కో వార్డుకు రూ.కోటి నిధులు మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. తాండూరులో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి యువకులు, ప్రజలు స్వచ్ఛందంగా ఎమ్మెల్యే వెంట నడుస్తున్నారని, మహేందర్‌రెడ్డి మాత్రం అభివృద్ధికి సహకరించకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి గతంలో అన్నా తెలుగుదేశం నుంచి తెలుగుదేశం పార్టీలోకి వెళ్లారని.. ఆతర్వాత తెలంగాణ ఏర్పాటయ్యాక బీఆర్ఎస్‌లో చేరారనే విషయాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. రోహిత్‌రెడ్డి పార్టీ మారింది కేవలం తాండూరు అభివృద్ధి కోసమేనని.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నయీమ్, మాజీ కౌన్సిలర్ ఇర్ఫాన్, నాయకులు పట్లోళ్ల నర్సింలు, అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకం.. నరకం!

- అన్నదాతకు చుక్కలు చూపిస్తున్న మిల్లర్లు, సెంటర్ల నిర్వాహకులు
- ఎక్కడికక్కడే నిలిచిపోతున్న కొనుగోళ్ల ప్రక్రియ
- తూకం వేసిన బస్తాల తరలింపునకు రవాణా అవస్థలు
- మిల్లుల వద్ద అన్‌లోడింగ్ సమస్య
- మిల్లర్ల కొర్రీలపై స్పందించని అధికారులు



దౌల్తాబాద్ వద్ద క్యూకట్టిన ట్రాక్టర్లు

దౌల్తాబాద్: ధాన్యం అమ్మకానికి బయలుదేరిన అన్నదాతకు అంతా కలిసి చుక్కలు చూపిస్తున్నారు. జిల్లాలో కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. కొనుగోలు కేంద్రాల వద్ద తూకం వేయక.. తూకం పూర్తయిన ధాన్యం బస్తాలను తరలించక.. హమాలీల కొరత పేరుతో మిల్లుల వద్ద లోడ్లు దించుకోక రైతులు నరకం అనుభవిస్తున్నారు. దీనికి తోడు ధాన్యం మిల్లింగ్‌లో 68శాతం బియ్యం రావాలనే నిబంధనతో మిల్లర్లు కొర్రీలు పెడుతున్నా అధికారులు అస్సలు స్పందించడంలేదు. దీంతో రోజుల తరబడి అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నతాధికారులు ఎంత తొందరపెడుతున్నా.. క్షేత్రస్థాయి యంత్రాంగం, సిబ్బందిలో కనీస చలనం కూడా కనిపించడం లేదు. కనీసం కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యలైనా పరిష్కరించలేని దుస్థితి నెలకొంది.

తరలింపునకు సిద్ధంగా ఉన్నా..

దౌల్తాబాద్ మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ తరపున 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సుమారు ఆయా కేంద్రాల పరిధిలో 10వేల బస్తాలు తూకం వేసి తరలింపునకు సిద్ధంగా ఉన్నాయి. లారీలు రాకపోవడం, ట్రాక్టర్లలో తరలిస్తే మిల్లర్లు త్వరగా అన్‌లోడ్ చేయకపోవడం వంటి సమస్యలతో రైతులు సతమతమవుతున్నారు. వర్షం వస్తే తడుస్తాయని కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలు తూకం వేసిన బస్తాలను టిపికీలు కొట్టి పరదాలు కప్పుతూ ఇబ్బందులు పడుతున్నారు.

మూడు రోజులుగా



గోకఫసల్‌వాద్ మిల్లు వద్ద మూడు రోజులుగా పడిగాపులు కాస్తున్నా. కిరాయి ట్రాక్టర్‌లో ధాన్యం తీసుకువచ్చా. రోజుకు కిరాయి రూ.3 వేలు. తూకం వేయాలని ఎవరికి చెప్పినా పట్టించుకోవడంలేదు. రోజుకు కిరాయితో పాటు నాకు, డ్రైవర్ తిండికి రూ.200 అవుతోంది. ఇలాంటి పంట వేసుకోవద్దు. ఈ ఇబ్బందులు పడొద్దు.

– సాయప్ప, గుముడాల

పొద్దున్నుంచి అన్నం తినలేదు



నాకున్న నాలుగెకరాల్లో సాగు చేశా. ధాన్యం అమ్ముకునేందుకు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ఇలాంటి ఇబ్బందులు పగోడికి కూడా రావద్దు. పొద్దున 6గంటల నుంచి సాయంత్రం వరకు తిండీ తిప్పలు లేకుండా కూర్చున్నా.. ఎమ్మెల్యే వచ్చి చెప్పిపోయిండు. ఇక్కడ లైన్ పెద్ద లైన్ ఉంది. తూకం ఎప్పుడైతదో తెలియదు.

– మోతీలాల్, రైతు, పోచమ్మతండా

క్లుప్తంగా

ఆటో, డీసీఎం ఢీ.. ఒకరి మృతి

మోమిన్‌పేట: ఆటోను డీసీఎం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన గురువారం మోమిన్‌పేటలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని గోవిందాపూర్‌కు చెందిన మహ్మద్ జాహుర్ (57) ఆటోలో ఏన్కతల వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన డీసీఎం వాహనం ఢీ కొట్టింది. దీంతో మహ్మద్ జాహుర్‌కు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌ప్రకాశ్ తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా

యాలాల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ప్రోత్సహించిన వారిపై సైతం కేసులు నమోదు అవుతాయని ఎస్ఐ అరవింద్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా అధ్యక్షతన బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడంతో జరిగే అనర్థాలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల వారికి పూర్తిగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. బాల్య వివాహాలు చేస్తే చట్టం ప్రకారం రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమ అనంతరం మండల బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా ఎంపీపీ, కార్యదర్శిగా ఎంపీడీఓ, కన్వీనర్‌గా సీడీపీఓ, సభ్యులుగా ఎస్ఐ, ఎంఈఓ, మెడికల్ ఆఫీసర్, ఏపీఎం తదితరులు ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పుష్పలీల, జిల్లా లీగల్ అధికారి నరేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పీహెచ్‌సీకి ఏసీల బహూకరణ

మొయినాబాద్: వేసవిలో రోగులకు ఉక్కపోత నుంచి ఉపశమనం కల్పించడానికి రాణే ఇంజన్ వాల్స్ కంపెనీ ముందుకొచ్చింది. మొయినాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మండల పరిధిలోని అజీజ్‌నగర్ రెవెన్యూలో ఉన్న రాణే ఇంజన్ వాల్స్ కంపెనీవారు 2 ఏసీ (ఎయిర్ కండిషన్)లను బహూకరించారు. గురువారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతులమీదుగా పీహెచ్‌సీ వైద్యాధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఏసీలు అందజేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసేందుకు దాతలు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, కంపెనీ జీఎంలు బీ.రెడ్డికుమార్, మహేశ్వరరావు, సతీష్‌కుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

యువత చూపు.. కంప్యూటర్ వైపు

- వేసవి సెలవుల్లో నేర్చుకుంటున్న విద్యార్థులు
- గృహిణులు సైతం ఆసక్తి
- కళకళలాడుతున్న కంప్యూటర్ సెంటర్లు



వికారాబాద్‌లోని ఓ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న యువతీయువకులు

అనంతగిరి: నేటి సమాజంలో కంప్యూటర్ పాత్ర చాలా ముఖ్యమైంది. నిత్య జీవితంలో ప్రాథమిక విద్య మొదలు కొని ఉన్నత చదువులు, ఉద్యోగాల వరకు సైతం కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అయ్యింది. కంప్యూటర్ లేనిదే ప్రస్తుతం ఏ రంగాన్ని ఊహించలేం. మనం ఎన్ని డిగ్రీలు, పీజీలు చదివినా ఉద్యోగాలు రావాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం అదనపు అర్హత. అందుకు గాను ఉద్యోగంలో తప్పనిసరిగా చదువు అర్హతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం సర్టిఫికెట్‌ను అడుగుతున్నారు. వికారాబాద్ ప్రాంతం రాజధాని దగ్గరగా ఉండటంతో ఏ ఉద్యోగానికి వెళ్లినా కంప్యూటర్ పరిజ్ఞానంతో ముడిపడి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో చిన్న నుంచి పెద్ద స్థాయి ఉద్యోగాల వరకు కంప్యూటర్ పరిజ్ఞానం అడుగుతుండటంతో వీలు చిక్కినపుడల్లా కంప్యూటర్ సబ్జెక్టు లేని వారి కూడా కోచింగ్ తీసుకుంటున్నారు.

వేసవి సెలవుల్లో..

వేసవి సెలవుల్లో పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు విద్యార్థులు, గృహిణులు సైతం కంప్యూటర్ కోచింగ్‌కు వెళ్తున్నారు. దీంతో కంప్యూటర్ సెంటర్లు బిజీగా మారుతున్నాయి. కోవిడ్ వల్ల 2–3 సంవత్సరాలు బోసిపోయిన కంప్యూటర్ కోచింగ్ సెంటర్లు నేడు కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం పోటీ ప్రపంచానికి అనుగుణంగా పలు కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారు.

నిత్య జీవితంలో తప్పనిసరి

అంతటా కంప్యూటరైజ్డ్

ఏ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నా, ఏ పోటీ పరీక్ష రాయాలనుకున్న అదనంగా కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో కంప్యూటర్ లేనిదే ఏ పని జరుగదు. అంతటా కంప్యూటరైజ్డ్ కావడంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంతో కొంత నేర్చుకోవడానికి కొందరు వెళితే మరికొందరయితే సంబంధిత కంప్యూటర్ కోర్సు పూర్తిగా నేర్చుకోవడానికి కోచింగ్‌కు వెళ్తున్నారు. ఉదయం, సాయంత్రం బ్యాచ్‌లో ప్రవేశాలు తీసుకుని గంట నుంచి రెండు గంటల పాటు కంప్యూటర్ సెంటర్‌లలో కంప్యూటర్ పరిజ్ఞానం నేర్చుకుంటున్నారు. ముఖ్యంగా కంప్యూటర్ పరిజ్ఞానంలో బేసిక్స్, డీసీఏ, పీజీడీసీఏ, అడ్వాన్స్‌డ్ పీజీడీసీఏ, ఫొటోషాప్, డీటీపీ, 2డి యానిమేషన్, అకౌంటింగ్ ప్యాకేజీలు, మల్టీమీడియా, సీ, సీ ప్లస్, జావా, వెబ్ డిజైనింగ్, హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్,టైప్ రైటింగ్, డీటీపీ, పైథాన్, డాటా బేస్ సాఫ్ట్‌వేర్‌లతో పాటు వివిధ కోర్సుల్లో శిక్షణ అందుబాటులో ఉన్నాయి. కాగా సమ్మర్ స్పెషల్ కోచింగ్‌ల పేర కోర్సులను బట్టి ఫీజులు తీసుకుంటున్నారు. ఎండాకాలం సెలవులు ఉండటంతో చాలా మంది విద్యార్థులు షార్ట్‌టైం కోచింగ్ తీసుకుంటూ శిక్షణ సమయం ఎక్కువగా తీసుకుని శిక్షణ తీసుకుంటున్నారు.

కంప్యూటర్ నాలెడ్జ్ అవసరం



నేను డిగ్రీ పూర్తి చేశాను. కేవలం డిగ్రీతోనే ఉద్యోగాలు సాధించడం కష్టం. ఏ ఉద్యోగం రావాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం అడుగుతున్నారు. అందుకే కంప్యూటర్‌లో శిక్షణ తీసుకుంటున్నా. కంప్యూటర్ నాలెడ్జ్ ఉంటే అన్నింటికి ఉపయోగపడుతుంది. కనుక కంప్యూటర్‌పై పట్టు సాధిస్తే మంచిదని నేర్చుకుంటున్నా. – ఎండీ ఫయాజ్, విద్యార్థి

భవిష్యత్తు కోసం తప్పనిసరి



నేను ఇంటర్ చదువుతున్నా.. వేసవి సెలవుల్లో కంప్యూటర్ కోచింగ్ తీసుకుంటున్నాను. భవిష్యత్తులో తప్పనిసరిగా అవసరం వస్తుంది. నిత్యం రెండు గంటల పాటు శిక్షణ ఇస్తున్నారు. షార్ట్ టైంలో నేర్చుకుంటున్నాను. చాలా మంది కంప్యూటర్ నేర్చుకోవడానికి వస్తున్నారు. – నవీన, విద్యార్థిని

పరిజ్ఞానం ఉంటేనే రాణింపు



సమ్మర్ సీజన్లో ప్రత్యేక బ్యాచ్‌లు కొనసాగుతున్నాయి. కంప్యూటర్ పరిజ్ఞానం లేనిది ప్రస్తుతం ఏ రంగంలో కూడా ఉద్యోగాలు, వ్యాపారాలు చేయలేం. విద్యార్థులు ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులు కూడా వచ్చి నేర్చుకుంటున్నారు. అందుబాటులో ఉన్న టైంలో శిక్షణ తీసుకుంటున్నారు. – శ్రీకాంత్, కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు



నాలుగు లేన్లుగా మారనున్న తాండూరు - హైదరాబాద్ రోడ్డు మార్గం

తాండూరు రోడ్లకు మహర్దశ

- ఇక నాలుగు లేన్లుగా మార్పు
- తాజాగా మరో రూ.20.20 కోట్లు మంజూరు
- రోడ్లు భవనాల శాఖ ఉత్తర్వులు జారీ

తాండూరు: పట్టణ రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఇప్పటి వరకు రెండు వరుసల రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న వాహనదారుల సమస్యలకు ఇక చెక్ పడనుంది. రోడ్లు భవనాల శాఖ గురువారం రూ.20.20కోట్ల నిధులను మంజూరు చేస్తు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉంటే.. వారం రోజుల క్రితమే పట్టణం నుంచి సెయింట్ మార్క్స్ స్కూల్ వరకు ఉన్న ప్రధాన రోడ్డును నాలుగు లేన్లుగా మార్చేందుకు, అలాగే వరద నీటి కాలువల నిర్మాణానికి ప్రభుత్వం రూ.25కోట్లు మంజూరు చేసింది. తాండూరు నియోజకవర్గానికి 6 నెలల క్రితం ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.135 కోట్లు మంజూరు అయిన విషయం విదితమే. వాటికి సంబంధించిన పనులు కూడా జరుగుతున్నాయి. తాజాగా మంజూరు చేసిన నిధులతో తాండూరు పట్టణంలోని విలియం మూన్ చౌక్ నుంచి ఖాంజాపూర్ వరకు నాలుగు లేన్ల రోడ్డు, వరద నీటి కాలువ నిర్మాణం, అంతారం శివారులోని బైపాస్ వరకు నాలుగు లేన్ల రోడ్డు చేపట్టనున్నారు.

సీఎంకు కృతజ్ఞతలు



తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులు విడుదల చేయడంతో ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నా. సీఎం ప్రోత్సాహం వల్ల తాండూరు శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అంతే కాకుండా అడిగిన వెంటనే నిధులను మంజూరు చేసిన ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డికి ధన్యవాదాలు.. – రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్యే,

అన్నను హత్య చేసిన తమ్ముడి రిమాండ్



నిందితుడు రవి

తాండూరు టౌన్: అన్నను హత్య చేసిన తమ్ముడిని పట్టణ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని చెంగోల్ బస్తీలో నివాసం ఉండే మద్దికంటి సతీశ్ (36) మంగళవారం రాత్రి హత్యకు గురైన విషయం విదితమే. మృతుడు మద్యానికి బానిసై, భార్యా పిల్లలను వేధించడంతో పాటు, తమ్ముడు మద్దికంటి రవి, అతని భార్యా పిల్లలను చంపుతామని బెదిరించసాగాడు. వేధింపులు భరించలేక అన్నను హత్య చేసినట్లు పోలీసు విచారణలో నిందితుడు తెలిపాడు. నిందితుడిని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

అవినీతికి పాల్పడితే చర్యలు

- డీఆర్‌డీఓ కృష్ణన్
- కొనసాగుతున్న 'సామాజిక తనిఖీలు'



సామాజిక తనిఖీలో పాల్గొన్న డీఆర్‌డీఓ కృష్ణన్, అడిషనల్ డీఆర్‌డీఓ స్టీవెన్ తదితరులు

మర్పల్లి: ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవినీతి జరిగినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని డీఆర్‌డీఓ కృష్ణన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అదనపు డీఆర్‌డీఓ స్టీవెన్‌తో కలిసి రెండు రోజులుగా సామాజిక తనిఖీలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 01 డిసెంబర్ 2019 నుంచి 31 మార్చి 2023 వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు చేస్తున్నామన్నారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీలలో వివిధ రకాల అభివృద్ధి పనుల కోసం 39 కోట్ల 50 లక్షల 54 వేల 919 రూపాయలు వెచ్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా వలస కూలీలకు స్థానికంగా ఉపాధి కల్పించడం, ప్రతి గ్రామంలో వైకుంఠ ధామం పనులు, కాంపోస్టు షెడ్ పనులు, 152 కిలో మీటర్లు ఎవేన్యూ ప్లాంటేషన్ చేపట్టినట్లు వివరించారు. చేపట్టిన పనులు గ్రామాలలో సక్రమంగా జరిగాయా? ఏవైనా అవకతవకలు జరిగాయా అనే వివరాలను తమ సామాజిక తనఖీ బృందం పని ప్రదేశాలకు వెళ్లి వివరాలు సేకరించిందన్నారు. ఈ తనిఖీలో అవినీతి జరిగినట్లుతేలిచే తప్పక చర్యలు ఉంటాయన్నారు. కొన్ని చోట్ల కూలీలు పనిచేకుండానే కూలీ డబ్బులు చెల్లించినట్లు మస్టర్లలో రికార్డు చేసినట్లు ఉందన్నారు. అలాగే చనిపోయిన వ్యక్తులపై కూలీ పనులు చేసినట్లు తేలిందని, అవనీతికి పాల్పడ్డ వ్యక్తులపై రికవరీ చేయిస్తామన్నారు. పనుల్లో సరైన మెటీరియల్ వాడకుండానే బిల్లులు చేశారన్నారు. గ్రామాల్లో ఇంకా పనులు అసంపూర్తిగా ఉంటే గడువులోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజ్ మల్లయ్య, ఎంపీఓ మహేశ్, ఏపీఓ అంజీరెడ్డి, ఈసీ విఠల్ ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగిరం చేయండి



రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న ఆర్డీఓ విజయకుమారి

- రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు
- ఆర్డీఓ విజయకుమారి

దోమ: వరి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని ఆర్డీఓ విజయకుమారి సంబంధిత అధికారులకు, రైస్ మిల్లర్స్‌కు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని పౌర సరఫరాల జిల్లా అధికారి రాజేశ్వర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన గన్నీబ్యాగులు రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. తరుగు, తాలు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైస్ మిల్లర్లతో భేటీ

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో కలసి రైస్ మిల్లర్ల యజమానులతో భేటీ అయ్యారు. ధాన్యం సేకరణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు వాహనాలను పంపించేలా చర్యలు తీసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ఇబ్బందులు తలెత్తితే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాహెదబేగం, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ రావు, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, సివిల్ సప్లై డీటీ మల్లికార్జున్‌రావు, ఆర్ఐ లింగం, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని మహిళ మృతి

అనంతగిరి: ఓ గుర్తు తెలియని మహిళ రైలు నుంచి ప్రమాదవశాత్తు పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన వికారాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోదాంగూడ– ధారూరు రైల్వే స్టేషన్ మధ్య రైల్వే ట్రాక్ పక్కన ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెంది ఉందని రైల్వే సిబ్బందికి తెలిపారు. రైల్వే పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. 25–30 సంవత్సరాల వయసు ఉంటుందని, ఒంటిపై నలుపు, ఎరుపు రంగు డిజైన్ కలిగిన టాప్, పింక్ కలర్ లెగిన్ ధరించి ఉంది. మృతురాలు రైలు నుంచి ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు పడిపోయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'మన బడి'కి వెళ్లేదెన్నడో?

- ఇంకా పూర్తికాని పనులు
- పక్షం రోజుల్లో విద్యాసంవత్సరం ప్రారంభం
- మరోవైపు వేధిస్తున్న నిధుల కొరత
- దృష్టిసారించని అధికారులు



పిల్లర్ల వరకే పరిమితమైన మరికల్ ప్రాథమిక పాఠశాల పనులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత పాఠశాలలను అభివృద్ధి పరిచి, విద్యావ్యవస్థ ఉన్నతికి కృషిచేయాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు మాత్రం కనిపించని పరిస్థితి నెలకొంది. నిధుల కొరతతో పాటు అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి.

కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో..

కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో 101 పాఠశాలలు ఉన్నాయి. మన ఊరు మన బడి పథకంలో భాగంగా మొదటివిడతలో కుల్కచర్ల మండలంలో 26 పాఠశాలలు, చౌడాపూర్‌లో 14 పాఠశాలలను ఎంపిక చేశారు. కుల్కచర్ల మండలంలో రూ.5కోట్ల 12లక్షలతో పనులు నిర్వహిస్తుండగా చౌడాపూర్‌లో 4కోట్ల 53 లక్షల 59వేల రూపాయల నిధులతో పనులను నిర్వహిస్తున్నారు. వీటికి అదనంగా పాఠశాలలో ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణానికి ఉపాధిహామీ నిధులను కేటాయించారు. నేతల మాటల్లో, కాగితాలలో నిధులు భారీగా కనిపిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా పరిస్థితి కనిపించడం గమనార్హం.

నత్తనడకన పనులు

కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో కొనసాగుతున్న పనుల్లో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఎంపికైన 40 పాఠశాలల్లో ఇప్పటివరకు కేవలం పదింటిలో మాత్రమే పనులు పూర్తి అయ్యాయి. మిగతా పాఠశాలల్లో నత్తనడకన పనులు కొనసాగుతున్నాయి. పనుల నిర్వహణ ఇరిగేషన్‌శాఖ అధికారులకు అప్పగించడం.. అనుభవం లేకపోవడంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల అవగాహన రాహిత్యం, పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. విద్యాసంవత్సరం ప్రారంభం కావడానికి మరో 15రోజులు మాత్రమే సమయం ఉండటంతో మన బడి పనులు పూర్తయ్యేది అనుమానంగా మారింది.

నిధులు విడుదల చేయకుండానే..



ప్రభుత్వం చెబుతున్న మాటలు వాస్తవరూపంలో కనిపించడం లేదు. పాఠశాలలు ప్రారంభించడానికి సమయం దగ్గరపడుతున్నా పనులు ఇంకా పూర్తికాలేదు. నిధులు విడుదల చేయకుండా పనులు పూర్తిచేయాలని చెప్పడం విడ్డూరం. ఈసారీ విద్యార్థులకు తిప్పలు తప్పని దుస్థితి. – రమేశ్, కల్మన్‌కాల్వ గ్రామస్తుడు

పనులు వేగిరం చేయిస్తాం



కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో కొనసాగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. పనులు వేగిరం చేసేందుకు సంబంధిత అధికారులకు సూచిస్తున్నాం. విద్యాసంవత్సరం ప్రారంభ సమయానికి ఎక్కువ పాఠశాలలను సిద్ధం చేసేందుకు కృషిచేస్తాం. – హబీబ్ అహ్మద్, ఎంఈఓ కుల్కచర్ల

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

శంకర్‌పల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. సీఐ ప్రసన్నకుమార్ తెలిపినవివరాలు.. శంకర్‌పల్లి పీఎస్ పరిధిలోని సింగాపురం గ్రామ శివారులో నూతనంగా నిర్మాణం అవుతున్న చైతన్య స్కూల్ పరిసరాల్లో గుర్తుతెలియని వ్యక్తి (42) మృతదేహం కన్పించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ ప్రసన్నకుమార్, ఎస్ఐ కృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. శవం పూర్తిగా కుళ్లిపోవడంతో ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. వారం రోజుల క్రితం మృతి చెందినట్లుగా పోలీసులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రేషన్ దుకాణాల్లో ముక్కిన బియ్యం



ధారూరులోని ఓ రేషన్ షాపునకు సరఫరా అయిన ముక్కిన బియ్యం

ధారూరు: మండలంలోని పలు రేషన్ దుకాణాల్లో ముక్కిన బియ్యం పంపిణీ చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. ముక్కిన బియ్యం మాకొద్దని అంటున్నారు. ఈనెల కోటా కూడా అదే విధంగా వచ్చాయని వారు విచారం వ్యక్తం చేశారు. తినేందుకు ఇవి పనికి రావని వారు అన్నారు. బియ్యం నాసిరకంగా ఉన్నాయని డీలర్లు కూడా పేర్కొంటున్నారు. ఈనెల కోటా ముక్కిన బియ్యం వచ్చినట్లు స్వయంగా వారే చెబుతున్నారు. బియ్యంలో ఎరుపు, పసుపు, తెలుపు రంగులున్నాయని వినియోగదారులు తెలిపారు. తీసుకోకపోతే తదుపరి కోటా బియ్యం రావేమోనని భయపడి తీసుకుంటున్నామని అంటున్నారు.

ఉన్నతాధికారులకు వివరిస్తాం

మండలంలోని ఏఏ రేషన్ షాపులకు ముక్కిన బియ్యం సరఫరా చేశారో తెలుసుకుంటామని తహసీల్దార్ భవనేశ్వర్ తెలిపారు. వాటి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. చింతకుంట, హరిదాస్‌పల్లి, ధారూరులలో ముక్కిన బియ్యం వచ్చినట్లు తెలిసిందన్నారు.

మేదర కుటుంబాలను ఆదుకోవాలి



నగదు అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్ రూరల్: రాష్ట్రంలోని మెజార్టీ మేదర కులాల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్నాయని.. వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర మేదర సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ కోరారు. మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలోని పుట్టమమత ఇల్లు గత నెలలో అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. దీంతో ఆ కుటుంబం నిలువ నీడలేక రోడ్డుపై పడింది. వారిని ఆదుకునేందుకు మేదర సంఘం తరపున సభ్యులందరూ ఆర్థికసహాయం అందజేశారు. రంగారెడ్డి జిల్లా మేదర సంఘం ఆధ్వర్యంలో ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్నామన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం పేదరికంలో ఉన్న మేదర కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, యాదగిరి, మహవీర్, నాగరాజు, యాదయ్య, రవి, ప్రచార కార్యదర్శి రమాకాంత్, కోశాధికారి ఉమా, మండల అధ్యక్షుడు ఎల్లయ్య, కనకరాజు, షాబాద్ అధ్యక్షుడు భిక్షపతి, రాజేంద్రనగర్ అధ్యక్షుడు శ్రీశైలం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.